# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-10-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. దేశంలో ఆరోగ్య రంగానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు ప్రారంభిస్తారు.
2. వన్యప్రాణులను వేటాడటం, అక్రమ రవాణా చేయడం వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ తెలిపారు.
3. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.
4. తెలంగాణలో వచ్చే నెల 6వ తేదీ నుంచి కులగణనను చేపట్టనున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వెల్లడించారు.
5. ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రాయితీ నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

===========================

దేశంలో ఆరోగ్య సంరక్షణ రంగానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభిస్తారు. సుమారు 12 వేల 850 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.. ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని దేశంలోని మొదటి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద రెండవ దశను నరేంంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఇందులో పంచకర్మ ఆసుపత్రి, ఔషధాల తయారీకి ఆయుర్వేద ఫార్మసీలు ఉన్నాయి.

అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మూడు ప్రాజెక్టులను ప్రధానమంత్రి దృశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించనున్నారు. వీటిలో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఈఎస్ఐ ఆసుపత్రి శంకుస్థాపన, మంగళగిరి, బీబీనగర్ ఎయిమ్స్‌లలో డ్రోన్ సేవలకు శ్రీకారం, హైదరాబాద్, కాకినాడల్లో వైద్య పరికరాలు, బల్క్ డ్రగ్స్ ప్రాజెక్టులను ప్రారంభోత్సవం చేయనున్నారు.

-------------------------

వన్యప్రాణులను వేటాడటం, అక్రమ రవాణా చేయడం వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో వన్యప్రాణుల సంరక్షణ కోసం రూపొందించిన యాంటీ పోచింగ్ సెల్ గోడపత్రికను ఆయన నిన్న విడుదల

చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, జంతువులు, చెట్లు, పశుపక్ష్యాదుల పట్ల కరుణ చూపాలని, వాటికీ మనలాగే బతికే హక్కుందని అన్నారు. ఎవరైనా వన్యప్రాణులను వేటాడినా, అక్రమ రవాణాకు పాల్పడినా అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే 18004255909 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని ఉపముఖ్యమంత్రి కోరారు.

---------------------------

రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతిలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా ప్రయోజనం కోసం ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని మంత్రి పేర్కొంటూ...

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

తెలంగాణలో వచ్చే నెల 6వ తేదీ నుంచి కులగణనను చేపట్టనున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో సామాజికవేత్తలు, మేధావులతో సమావేశమై కులగణనలో చేయాల్సిన మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణనకు సంబంధించి ప్రణాళిక శాఖ ప్రశ్నపత్రం రూపొందించిందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 300 మంది సామాజికవేత్తలు, మేధావులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను, సందేశాలను పరిగణనలోకి తీసుకుంటామని భట్టివిక్రమార్క పేర్కొన్నారు.

---------------------------

భారత దేశ సమైక్యత కోసం అవిరళ కృషి చేసిన మహనీయుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దేశానికి అందజేసిన సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన జయంతి అక్టోబర్ 31 వ తేదీని రాష్ట్రీయ ఏక్తా దివస్ గా కేంద్ర ప్రభుత్వం జరుపుతోంది. దేశ సమైక్యతను కాంక్షిస్తూ, ఆ రోజున దేశ వ్యాప్తంగా ఐక్యతా పరుగు నిర్వహిస్తోంది. అయితే అక్టోబర్ 31వ తేదీన దీపావళి పర్వదినం అయిన కారణంగా ఐక్యతా పరుగు ఈ రోజు నిర్వహిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఐక్యత పరుగు మార్పు తేదీని తన మన్ కీ బాత్ కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈరోజు జరిగే ఐక్యతా పరుగులో దేశ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని దేశ సమైక్యతను చాటాలని ఆయన పిలుపు నిచ్చారు. జాతీయ ఐక్యతా మంత్రంతో పాటు ఫిట్ నెస్ సందేశాన్ని కూడా ప్రతి ప్రాంతానికి తీసుకువెళ్లాలని ప్రధాన మంత్రి సూచిస్తూ

వాయిస్ (30సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రాయితీ నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పథకం అమలులో భాగంగా సిలిండర్ల రాయితీకి సంబంధించి 895 కోట్ల రూపాయలను విడుదల చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు పౌరసరఫరాల కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఈ నెల 31వ తేదీ నుంచి ఉచిత సిలిండర్లను ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేయనుంది.

---------------------------

తెలంగాణలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా మంథని మార్కెట్ యార్డుతో పాటు ఎక్లాస్ పూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి నిన్న ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యానికి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలుతో పాటు సన్న రకం వరి ధాన్యం పండించిన రైతులందరికీ క్వింటాలకు 500 రూపాయల అదనపు నగదును చెల్లిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి 4 వేల 500 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని అనకాపల్లి జిల్లా ఇంఛార్జ్ మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిన్న ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధితో పాటు, జిల్లా అభివృద్ధికి, ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులను పూర్తి చేయన్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనంత సాగరంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమశిల జలాశయం అభివృద్ధితో పాటు, నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైను పూర్తి చేసి ఆత్మకూరు ప్రాంత ప్రజలకు రైలు సౌకర్యం కల్పిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణాలో లక్ష ఎకరాల్లో రైతులతో ఆయిల్ పామ్ సాగు చేయించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. భద్రాచలంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, మలేషియాలో ఆయిల్ పామ్ ప్రధానమైన పంట అని అన్నారు. సాధారణ పంటల సాగు కంటే ఆయిల్ పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని, ఈ పంటను పెద్ద ఎత్తున సాగు చేసేలా, రైతులను అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం కింద 20 లక్షల రూపాయల వ్యయంతో కచ్చా రహదారుల నిర్మాణం చేపట్టనున్నామని అన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 120 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను చేపట్టామని, వాటిని వచ్చే జనవరి నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టును రాష్ట్ర మంత్రులు ఈరోజు సందర్శిస్తారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నేతృత్వంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులైన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ లు ప్రాజెక్టును సందర్శిస్తారు. ఈ ఉదయం దోర్నాల చేరుకొన్న మంత్రులు తొలుత సొరంగాలు, వెలిగొండ కాలువలు, ఇతరత్రా పనులను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

======================